# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 23-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను 26 మంది శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ప్రదానం చేశారు.

- విద్యా సంస్థలు ఏఐ జ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ ఆకాంక్షించారు.

- రైతులు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం విబి-జి-రామ్-జి చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

- భారత్ శ్రీలంక మహిళా జట్ల మధ్య టీ-20 క్రికెట్ మ్యాచ్ విశాఖపట్టణం వేదికగా జరుగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఆవిష్కరణలు, శాస్త్ర సాంకేతిక రంగాలలో అసాధారణ కృషి చేసిన శాస్త్రవేత్తలకు, సాంకేతిక నిపుణులకు రాష్ట్రీయ విజ్ఞాన్ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఈరోజు జరిగిన కార్యక్రమంలో 2025 సంవత్సరానికి గానూ విజ్ఞాన్ రత్న, విజ్ఞాన్ శ్రీ, విజ్ఞాన్ యువ, విజ్ఞాన్ బృందంతో సహా నాలుగు విభాగాల కింద మొత్తం 26 మంది రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు. పద్మ విభూషణ్ ప్రొఫెసర్ జయంత్ విష్ణు నార్లికర్ మరణానంతరం విజ్ఞాన్ రత్న అవార్డుతో సత్కరించబడ్డారు. డాక్టర్ యూసుఫ్ మొహమ్మద్ షేక్, ఎన్ జయన్, ప్రొఫెసర్ మహాన్ మహారాజ్ సహా 8 మంది శాస్త్రవేత్తలకు విజ్ఞాన్ శ్రీ అవార్డు లభించింది. ఇస్రోకు చెందిన అంకుర్ గార్గ్, ఐఐటీ కాన్పూర్‌కు చెందిన ప్రొఫెసర్ అమిత్ కుమార్ అగర్వాల్, బెంగళూరు ఐఐఎస్సీకి చెందిన ప్రొఫెసర్ అర్కప్రవా బసుతో సహా 14 మంది యువ శాస్త్రవేత్తలకు విజ్ఞాన్ యువ-శాంతి స్వరూప్ భట్నాగర్ విభాగం కింద అవార్డులు వరించాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

మానవ సంక్షేమం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)ను నైతికమైన ధోరణిలో ఉపయోగించాలని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. న్యూ ఢిల్లీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కు సంబంధించిన ఒక జాతీయ సదస్సులో ఈ రోజు ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ఏఐను ఒక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు.

విద్యా సంస్థలు AI జ్ఞాన కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన AI అభివృద్ధిలో భారత్ ప్రపంచానికి మార్గనిర్దేశం చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమకాలీన అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని సీపీ రాధాకృష్ణన్ ఈ సందర్భంగా పేర్కొంటూ…

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పూర్వ ప్రధానమంత్రి, భారత్ రత్న చౌధరీ చరణ్ సింగ్ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు. వ్యవసాయ రంగ పురోగతి, రైతుల సౌభాగ్యం కోసం చరణ్ సింగ్ తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. దేశ నిర్మాణానికి ఆయన అందించిన సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

మధ్యప్రదేశ్ లో ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ చేపట్టిన ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదాను ఈరోజు విడుదల చేసింది. ఆ రాష్ట్రంలోని మొత్తం 230 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన జాబితాను ఓటర్లకు అందుబాటులోకి తీసుకొచ్చింది. ఓటర్లకు తమ పేర్ల మార్పులు, చేర్పులు, తొలగింపు చేసుకునే అవకాశం కల్పించింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, ఎస్ఐఆర్ ప్రక్రియ కింద మరణించిన ఓటర్ల పేర్లు, బదిలీ అయిన ఓటర్లు, నకిలీ ఓటర్లను తొలగించామని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈ జాబితాలో పేర్లు లేని ఓటర్లు అవసరమైన పత్రాలతో వచ్చే జనవరి 22 వరకు అభ్యంతరాలను సమర్పించవచ్చని స్పష్టం చేసింది. తుది ఓటరు జాబితా 2026 ఫిబ్రవరి 21న విడుదల చేస్తామని ఎన్నికల సంఘం వెల్లడించింది. అదే విధంగా ఛత్తీస్‌గఢ్ లో కూడా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టిన ఎన్నికల సంఘం ఆ రాష్ట్ర ఓటర్ల ముసాయిదాను ఈ రోజు విడుదల చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = =

రైతులు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి-జి-రామ్-జి) చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా దేశ వ్యాప్తంగా రైతులతో ఈరోజు వర్చువల్‌గా సంభాషించిన ఆయన.. రైతులు కార్మికుల సంక్షేమం కోసమే చట్టంలో బలమైన నిబంధనలు చేర్చామని చెప్పారు. గతంలో అమలు చేయబడిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబి-జి-రామ్-జి చట్టం మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఈ చట్టం వ్యవసాయ సీజన్లలో కార్మికుల లభ్యతను మెరుగుపరుస్తుందని, ఉపాధి దినాల సంఖ్యను 100 నుండి 125 రోజులకు పెంచినట్లు తెలిపారు. ఈ సంవత్సరం దీని కోసం లక్షా 51 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రతిపాదనలు చేస్తున్నామని శివరాజ్ సింగ్ చౌహాన్ వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

శ్రీలంకలో దిత్వా తుఫాను కారణంగా ప్రభావితమైన ప్రాంతాల పునర్నిర్మాణానికి భారత్ 4,050 కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చెప్పారు. శ్రీలంకలో పర్యటించిన ఆయన ఈరోజు కొలంబోలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయంతో తుఫాను ప్రభావిత ప్రాంతాలలో రోడ్డు, రైల్వే కనెక్టివిటీ పునరుద్ధరణకు భారత్ మద్దతు ఇస్తుందన్నారు. ఆపరేషన్ సాగర్ బంధు కింద భారత్.. శ్రీలంక దేశానికి దాదాపు 1,100 టన్నుల సహాయ సామగ్రిని, 14.5 టన్నులకు పైగా ఔషధాలు, వైద్య

పరికరాలను అందించిందని వెల్లడించారు. ఈ క్లిష్ట సమయంలో కూడా శ్రీలంకలో పర్యాటకాన్ని భారతదేశం ప్రోత్సహిస్తూనే ఉంటుందని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచడానికి సైతం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అంతకుముందు ఆ దేశ అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే, ప్రధానమంత్రి హరిణి అమరసూర్యలను కలిసిన జైశంకర్ తుఫాను నష్ట ప్రభావంపై చర్చలు జరిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

విశాఖపట్నంలో పీసా మహోత్సవం ఈ రోజు ఘనంగా ప్రారంభమైంది. పంచాయతీలు (షెడ్యూల్డ్ ఏరియాల విస్తరణ) PESA చట్టం, 1996 ప్రాముఖ్యతను చాటిచెప్పేలా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ మహోత్సవం నగరంలోని ఆర్.కే. బీచ్ రోడ్ లో ఉదయం పీసా రన్ పేరిట నిర్వహించిన 10 కె మారథాన్ తో ఉత్సాహంగా మొదలైంది. అర్జున అవార్డు గ్రహీత భారతీయ విలు విద్య (ఆర్చరీ) క్రీడాకారిణి జ్యోతి సురేఖ వెన్నం ఈ మారథాన్ ను ప్రారంభించగా.. గిరిజన యువతతో పాటూ స్థానికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం నగరంలోని పోర్ట్ స్టేడియంలో పీసా మహోత్సవాన్ని అధికారికంగా పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ముక్తా శేఖర్, ఆర్థిక సలహాదారు డాక్టర్ బిజయ్ కుమార్ బెహేరా ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. పీసా మహోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రాఫ్ట్ బజార్, ఫుడ్ ఫెస్టివల్ తో కూడిన ప్రదర్శన స్టాళ్లు గిరిజన హస్తకళలు, స్థానిక వంటకాలను ప్రదర్శించాయి. కబడ్డీ, విలువిద్య పోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి వివిధ పీసా రాష్ట్రాల బృందాలతో నిర్వహించిన గిరిజన డెమో క్రీడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకలు గిరిజనుల క్రీడా వారసత్వాన్ని ప్రదర్శించాయి. గిరిజన హక్కులు, గ్రామ సభల బలోపేతమే లక్ష్యంగా రెండు రోజుల పాటూ ఈ వేడుకలు జరుగుతున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

భారత్, శ్రీలంక మహిళా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్ లో భాగంగా విశాఖపట్నం వేదికగా రెండవ టీ-20 క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. నగరంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక భారత్ కు 129 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ నెల 29వ తేదీ వరకూ దట్టమైన పొగమంచుతో కూడిన వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అదే విధంగా మధ్యప్రదేశ్, ఒడిశా, జార్ఖండ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో చలిగాలులు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 85 వేల 567 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 43 పాయింట్ల నష్టంతో 85 వేల 524 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 4 పాయింట్లు లాభపడి 26 వేల 177 వద్ద ముగిసింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 89 రూపాయల 66 పైసలుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 62.18 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4 వేల 486 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =